తేవడం అమర్చడం జరుగుతుంది. | సంపాదకుడు: ఎన్.నరోత్తమరెడ్డి, ఎం.ఏ | పాల్గొంటాయి.

సంపుటి 16 సంచిక 274 * హైదరాబాదు 19—10—1963 శనివారం * 4 పేజీలు 7 నయాపైసలు

యు.పి. మంత్రుల ప్రమాణ స్వీకారం చెల్లబోదని స్పీకరు తీర్పు

లక్నో, అక్టో 18

ఉత్తరప్రదేశ్ మంత్రివర్గములో మంత్రులుగా 11 మంది, ఉపమంత్రులుగా ఐదుగురు ఈనెల 14వ తేదీన ప్రమాణస్వీకారంచేయడం చెల్లనేరదని నిన్న యు.పి. విధానసభ స్పీకరు శ్రీ మదన్ మోహనవర్మ ప్రకటించారు. పాతపద్ధతి ప్రకారం వారు ప్రమాణ స్వీకారాలు చేశారు కాబట్టి వారు మంత్రులుగా పనిచేసే వీలులేదనీ శ్రీ వర్మ అన్నారు.

1963 లో సవరించబడిన 16 వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారము సరయిన నమూనాలో గవర్నరుచే ప్రమాణ స్వీకారము జరిపించబడలేదని శ్రీ వర్మ ఆక్షేపణ తెలిపారు. సవరణ ప్రకారం భారతసమైక్యతను కూడా రక్షిస్తామని మంత్రులు ప్రమాణము స్వీకరించాలి. ఈ రాజ్యాంగ సవరణ బిల్లుకు రాష్ట్రపతి అక్టోబరు 14 కన్న ముందే ఆమోద ముద్ర వేశారు. రాష్ట్రపతి ఆమోదముద్ర పడకమునుపే అక్టోబరు 2న ప్రమాణ స్వీకారము చేసిన ముఖ్యమంత్రి. మరి నలుగురు మంత్రులు మాత్రం మంత్రులుగా వ్యవహరించవచ్చునని ఆయన పేర్కొన్నారు.

టిబెట్‌లో మరణాల పెరుగుదల

చైనా వైద్యులపట్ల టిబెటన్ల చిన్నచూపు

న్యూఢిల్లీ, అక్టో 18

టిబెట్‌ను చైనా ఆక్రమించుకున్న తర్వాత అక్కడ మరణాల సంఖ్య రెట్లు పెరిగినదని పశ్చిమ జర్మనీ పత్రికలలో ప్రచురించిన వార్తలనుబట్టి తెలుస్తున్నది. ప్రకృతివైద్యం, శస్త్రచికిత్సలలో నిపుణులైన టిబెటన్ సన్యాసులు రోగులకు చికిత్స చేయరాదని చైనా ప్రభుత్వం నిషేధించడమే యిందుకు కారణమని చెపుతున్నారు.

బౌద్ధారామాల నుంచి వైద్యసహాయం జరగరాదని చైనా ఆంక్ష విధించడంలోని అంతరార్థం లామాయిజమ్ స్థానంలో కమ్యూనిజాన్ని ప్రవేశపెట్టాలన్న సంకల్పమే. చైనా వైద్యులకే చికిత్స చేయడానికి అనుమతి వున్నది వారికి పరిపూర్ణమైన వైద్యశాస్త్రజ్ఞానం లేకపోవడంతో, టిబెటన్‌లకు వారిపై విశ్వాసంలేదు.

టిబెటన్‌ల ప్రతిఘటన, ఫలితంగా మరణాల సంఖ్య పెరుగుతూ, టిబెటన్‌లు స్వతంత్రంగా వున్నప్పటికంటె యప్పుడే ఎక్కువ సుఖంగా వున్నదని పెకింగ్ చేసే ప్రచారానికి విరుద్ధంగా వున్నాయి.

అణ్వాస్త్ర పరీక్షల పరిశీలనకు రష్యా ప్రాతికూల్యం

సమితి రాజకీయ సంఘంలో చర్చలు

న్యూయార్కు, అక్టో 18

భూగర్భంలో అణ్వస్త్ర ప్రయోగాలకు అంతర్జాతీయ పరిశీలక బృందము పర్యవేక్షణ ఉండాలనీ లేదా ఈ రంగములో అంతర్జాతీయ పరిశీలన జరుగుతుండాలన్న ప్రతిపాదననుఆమోదించడానికి రష్యా మళ్ళీ వ్యతిరేకించింది. వాతావరణంలో అణ్వస్త్ర ప్రయోగాలు సాగించాలనే ఫ్రాన్సు నిర్ణయం పట్ల కూడా రష్యా ఆ దోళన వ్యక్తపరిచింది.

ఐక్యరాజ్యసమితి రాజకీయ సంఘ సమావేశంలో రష్యా ప్రతినిధి కె. వి నోవికోవ్ మాట్లాడుతూ రష్యా భూభాగంలో అణ్వస్త్ర ప్రయోగాల పరి

హెచ్. ఎస్. సి. సప్లిమెంటు పరీక్షా కేంద్రాలు

అభ్యర్థుల ఇబ్బందులు

హైదరాబాదు, అక్టో 18

హెచ్. ఎస్. సి. సప్లిమెంటరీ పరీక్షలకు కూర్చుంటున్న కొందరు అభ్యర్థులు ఈ పరీక్షలు మొదలయిన మొదటిరోజు అనగా అక్టోబరు 1వ తేదీన తమపరీక్షా కేంద్రాన్ని దొరికించుకొనడంలో తమ అమూల్యమయిన కాలాన్ని వృథా చేయవలసి వచ్చింది.

ఈ అభ్యర్థులు నాంపల్లి లోని ప్రభుత్వ బాయ్స్ మల్టిపర్పస్ హైస్కూలుకు వెళ్ళగా అది కేంద్రం కాదని మొక్కరం జాహి రోడ్డుపైగల గాంధిభవన్ సమీపంలోగల పాఠశాల అని చెప్పారు. అక్కడికి వెళ్ళగా ఆ పాఠశాల కాదన్నారు. ఈ విధంగా వారు పెక్కుపాఠశాలల తిరిగిన తరువాత నాంపల్లిలోని ప్రభుత్వ బాలికల మల్టిపర్పస్ హైస్కూలు వారి పరీక్షా కేంద్రమని తెలిసింది.

ఫ్యాక్టరీ లైసెన్సుల పునరుద్ధరణ

హైదరాబాద్, అక్టో 18

ఫ్యాక్టరీ లైసెన్సుల పునరుద్ధరణకు 1963 అక్టోబరు 31వ తేదీ ఆఖరు రోజు అని ఆంధ్రప్రదేశ్‌లోని ఫ్యాక్టరీల వారందరికీ తెలియచేయబడుతున్నది. రెండవ నెంబరు ఫారంలో దరఖాస్తు వాని రెండు ప్రతులలో పంపించాలి. దరఖాస్తుతో ఫీజుచలాను అసలు ప్రతిని జతపరచాలి లైసెన్సుల పునరుద్ధరణ కొరకు పెట్టుకునే ఈ దరఖాస్తులు 1963 అక్టోబరు31వ తేదీనకానీ అంతకు పూర్వం కానీ హైదరాబాదులోని ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీల చీఫ్ ఇన్‌స్పెక్టరు కార్యాలయానికి చేరాలి.

బ్రిటిష్ ప్రధాని మాక్మిలన్ రాజీనామా

లార్డుహోంకు కొత్తమంత్రి వర్గనిర్మాణానికై ఆహ్వానం

లండన్, అక్టోబరు 18

బ్రిటిష్ ప్రధాని హెరాల్డు మాక్మిలన్ రాజీనామా చేసినట్లు ధికారపూర్వకముగా నేడు వెల్లడైంది. రాజీనామాను బ్రిటిష్ రాణి ఎలిజబెత్ ఆమోదించినట్టు కూడా బకింగ్‌హాం ప్యాలెస్ ప్రకటనలో తెలుపబడింది.

హెరాల్డు మాక్మిలన్‌తో సంప్రదించడానికి ఎలిజబత్ రాణి నేడు మార్లెలోన్‌లోని కింగ్ ఎడ్వర్డు హాస్పిటల్‌కు వెళ్ళి ఆతని వారసుని నియామకాన్నిగూర్చి సంప్రదించింది.

మాక్మిలన్ మంత్రివర్గంలో విదేశాంగ కార్యదర్శిగాఉన్న లార్డుహోం వయస్సు 60 సంవత్సరాలు, ఎలిజబత్ రాణి కొత్త మంత్రివర్గాన్ని ఏర్పరచమని ఆహ్వానించింది.

అస్సాం-త్రిపురాలలోని ముస్లిములు

వెళ్లగొట్టబడుతున్నారని పాక్ ఆరోపణ

డక్కా, అక్టోబరు 18

భారత సరిహద్దు రాష్ట్రాలగు అస్సాం, త్రిపురాలమండి ముస్లిములు వెళ్ళగొట్ట బడుతున్నారని ఈ సమస్యను పాకిస్తాన్ ఐక్య రాజ్యసమితి ముందుకు తేదలుస్తున్నదని తూర్పు పాకిస్తాన్ గవర్నరు అబ్దుల్ మోమెన్ ఖాన్ తెలిపారు.

పాకిస్తాన్ ఆరోపణకు ఖండన

న్యూఢిల్లీ, అక్టో 18

కాశ్మీర్ యుద్ధ విరమణ శ్రేణికి ఈవైపునగల ముస్లింజనాభాను వెళ్లగొట్టి ఒక సరిహద్దు గ్రామాన్ని ఆక్రమించదలుస్తున్నదనిపాకిస్తాన్ చేసినఆరోపణను భారత విదేశాంగ వ్యవహారాల మంత్రాంగ ప్రతినిధి అసత్యమని. పూర్తిగానిరాధారమైనదనిఖండించారు

ఆక్టోబరు 28 న జీతం నష్టం లేకుండా సెలవు

హైదరాబాద్, అక్టోబరు 18

1951వ సం.పు ఆంధ్రప్రదేశ్ [తెలంగాణా ప్రాంతం] దుకాణాలు, వ్యాపార సంస్థల చట్టనిబంధనల క్రింద దసరా మరుసటిరోజు అంటే 1963 అక్టోబరు 28వ తేదీ ఈ చట్టం అమల్లో నున్న ప్రాంతాలలోని దుకాణాలు, వ్యాపార సంస్థలలో పనిచేసే ఉద్యోగులందరికీ జీతంతోసహా సెలవు ప్రకటించబడింది. కాబట్టి దుకాణాలు, వ్యాపార సంస్థల యజమానులంతా ఆరోజున తమవద్ద పనిచేసే ఉద్యోగులకు జీతము నష్టం లేకుండా సెలవు ఇవ్వవలసి దిగా విజ్ఞప్తి చేయబడుతున్నది.

నిజామాబాదు జిల్లాలో సాంద్ర వ్యవసాయ పథకం

వ్యవసాయ మంత్రి శ్రీ బలరామి రెడ్డి ప్రారంభోత్సవం

నిజామాబాద్, అక్టోబరు 18

నిజామాబాద్ జిల్లాలో సాంద్ర వ్యవసాయ పథకానికి రాష్ట్ర వ్యవసాయ పశుసంవర్ధన శాఖ మంత్రి శ్రీ బలరామిరెడ్డి గత మంగళవారం యెల్లారెడ్డిలో ప్రారంభోత్సవము చేశారు.

సాంద్ర వ్యవసాయ స్కీము మూల ఉద్దేశ్యం వ్యవసాయోత్పత్తిని పెంచడమని అందుకయి ఈ పథకం క్రింద ఎరువులు మేలిరకం విత్తనాలు సాంకేతిక సహాయం ఇవ్వబడుతుందని వ్యవసాయదారులు ప్రభుత్వం కల్పించే ఈ సౌకర్యాల వినియోగించుకొని లాభపడాలని శ్రీ బలరామిరెడ్డి ఈ సందర్భంగా విపరించారు. పంటల ఇన్సూరెన్సు పథకాన్ని ప్రారంభించుటకు గూడా ప్రభుత్వం ఆలోచిస్తున్నదన్నారు.

యెల్లారెడ్డిలో గిడ్డంగి నిర్మాణానికి ప్రభుత్వం ఆలోచింప గలదన్నారు. పట్టణ మున్సిపాలిటీ చెయిర్మెన్ శ్రీరామచంద్రారెడ్డి యెల్లారెడ్డికయి మంచినీటి సరఫరా పథకాన్ని చేపట్టాలని ఒక గిడ్డంగికూడా కావాలని కోరారు.

వనపర్తిలో సిమెంటు, చక్కెర బ్లాక్ మార్కెట్ వ్యాపారం

(మా ప్రత్యేక విలేఖరి)

వనపర్తి, అక్టోబరు 18

వనపర్తి స్థానికంలో చక్కెర సిమెంటు బ్లాకు మార్కెటింగ్ అధికమవుతున్నట్లు తెలుస్తున్నది. చక్కెర గతమాసం రెండవ వారంలో ప్రజలకు పంపిణీ జరిగిన తర్వాత ఈ నెలారంభమున తిరిగి పంపిణీ జరగాల్సి వుంది. కాని యింతవరకు జరుగలేదు. కిలో ఒక్కంటికి కంట్రోలుధర రు. 1-20 అయితే బ్లాకులో కిలో రెండు రూపాయలు అంతకుపైగా అమ్ముచున్నారు, బ్లాకురేటుయిస్తే మణుగులకు మణుగులు చక్కెర లభిస్తున్నదట.

పంచదారేకాదు సిమెంటు విషయంలో ఈ రహస్య వ్యాపారం మరీ విపరీతంగా ఉన్నట్లు తెలుస్తున్నది. ప్రభుత్వ కంట్రాక్టులున్నవారికే విరివిగా సిమెంటు మంజూరీ యివ్వబడుచున్నది. సాధారణ ప్రజలకు కంట్రోలులో సిమెంటు అసలే దొరుకుట లేదు. బ్లాకు మార్కెట్‌లో మాత్రం బస్తా 13-50 లేక 14 రూపాయలకు లభ్యమగుచున్నది. పైగా ఇక్కడ గచ్చీకన్న సిమెంటు నిర్మాణాలే అధికంగా సాగుతున్నాయి.

రైతుల్లో యెంత పాతుకు పోయిందో విదితమవుతుంది. బ్లాకు అధికారులు యెడ్రిన్ వాడితే లోట్టపురుగు పోతుందని సర్టిఫికేట్ యిస్తున్నారు కాని అందువల్ల ప్రయోజనమేమీ అగుపించుట లేదు.

ఎడ్రిన్‌వల్ల లోట్ట తెగులు నివారణమాట అటుంచి యితరత్రా ఉపయోగాలున్నాయనుటలో సందేహం లేదు. జీవితంపై విరిగినవారు దీనిని వినియోగించు కుంటున్నారట.

ఈ సంవత్సరం పంటకు చాలానష్టం కలిగిందని; శిస్తుమాఫీ యివ్వాలని పలువురు అభ్యర్థిస్తున్నారు.

పరిపంటకు తెగుళ్లు

వనపర్తి తాలూకాలో పరిపంటకు లొట్టిపురుగుతగిలి నాల్గోవంతు పంట గూడ లభించే అవకాశం లేకుండా పోయింది. రోగమొక్కతే మందొక టన్నట్లు రైతులు ఈ తెగులు నివారణ

పార్కింగ్ జర్నలిస్టులకు రెండో వేజ్ బోర్డు నిర్మాణం

వచ్చే వారంలోనే సంభవం: పత్రికాసంస్థలలో ఇతర ఉద్యోగులకై మరో బోర్డు నిర్మాణంకూడా

న్యూఢిల్లీ, అక్టో 18

వర్కింగు జర్నలిస్టులకయి రెండవ వేతన నిర్ణాయక సంఘం నిర్మాణాన్ని గురించిన ప్రకటన వచ్చే వారాంతములోగా జరుగగలదని తెలుస్తున్నది. వేతన నిర్ణాయక సంఘములో ఎవరిని వేయాలో ఏయే విషయాలు ఆ సంఘము పరిశీలించాలో వివరాలు ఇప్పుడు ప్రభుత్వాలు చురుకుగా ఉన్నాయి.

టోకుధరలసూచీసంఖ్య

1963 సెప్టెంబరు 21తో అంతమైనవారం సమీక్ష

న్యూఢిల్లీ, అక్టోబరు 18

అధికార టోకుధరలకు అధికార పూర్వకమయిన సూచిక, 1953 మార్చితో పూర్తయిన సంవత్సరానికి 100గా తీసుకుంటే 1963 సెప్టెంబరు

ప్రణాళికా ఖర్చుల కై ద్రవ్య సేకరణ

ఆంధ్రప్రదేశ్ ఏమంత వెనుకపడిలేదని ప్రభుత్వప్రతినిధి వివరణ

హైదరాబాదు, అక్టో 18

అభివృద్ధి కార్యక్రమాలకై ఖర్చు చేయాలని పెట్టుకున్న లక్ష్యానికి తగినంత ధనాన్ని సమకూర్చుకోలేకపోయిన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ గూడాకలదన్న న్యూఢిల్లీ వార్తపై రాష్ట్రప్రభుత్వ ప్రతినిధి ఒకరు వాఖ్యానిస్తూ రాష్ట్రప్రభుత్వం ఐదేండ్ల కాలంలో రు. 53కోట్లు సేకరించవలసి ఉన్నదని ఇందులో ఈప్రణాళికాంతంవరకు సమకూర్చుకోవలసిన మొత్తం రు. 21 కోట్లేనని తెలిపారు.

ఈద్రవ్యాన్ని పూర్తిగా సమకూర్చలేకపోవడానికి వివిధ కారణాలున్నాయి: అంచులో ప్రధానమైనవి వివిధ పన్నుల ప్రతిపాదనల త్వరగా ఆమోదింప బడకపోవడం. ఈ ప్రణాళికయొక్క మిగతా రెండు సంవత్సరాలలో ఇంకొక 26 కోట్ల రూపాయల రాష్ట్రప్రభుత్వం సేకరించగలదన్నవిశ్వాసాన్ని ఈతను వ్యక్తం చేశారు.

మూడవప్రణాళిక నాల్గవ మరియు ఐదవ సంవత్సరంలో ఖర్చు చేయవలసిన ద్రవ్యం గూర్చి రాష్ట్రప్రభుత్వం ప్లానింగ్ కమిషన్‌తో చర్చించ గలదని వీరన్నారు.

పారిశ్రామిక కార్మికుల గృహనిర్మాణ పథకం

అర్హులైనవారికే ఇళ్లు కేటాయించాలని రాష్ట్రాలకు సూచన

న్యూఢిల్లీ, అక్టో 18

పారిశ్రామిక కార్మికుల గృహనిర్మాణసహాయపథకం క్రింద నిర్మించిన ఇళ్లలో ఖాళీగావున్న వాటిని, అర్హులు కానివారికి కేటాయించినఇళ్ళనూ, అర్హులైన కార్మికులకు వెంటనే కేటాయించాలని కేంద్రదేశీర్మాణాలు, గృహాలు, పునరావాస కల్పన మంత్రిత్వ శాఖ రాష్ట్రప్రభుత్వాలను కోరింది. లేని పక్షంలో ఆఇళ్ళనిర్మాణానికి కేంద్రం నుంచి తీసుకున్న సొమ్మును తిరిగి యిచ్చివేయాలని రాష్ట్రాలకు తెలియచేశారు.

ప్రవేశించడానికి సిద్ధముగా వున్న 98,716 ఇళ్ళలో 79, 1/2 ఇళ్లు సుమారు నూటికి 80 వంతులు అర్హులైన కార్మికులకు కేటాయించారు. 14,802ఇళ్లు నూటికి 15 వంతులు అనర్హులైనవారికి ఇచ్చారు. మరో 4,752 ఇళ్లు ఖాళీగా వున్నాయి.

గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు

రాష్ట్రప్రభుత్వాలకు ప్రణాళికా సంఘ సూచన

న్యూఢిల్లీ, అక్టో 18

ఇంతవరకూ సాధించిన ప్రగతిని దృష్టిలో పెట్టుకుంటూ, వచ్చే సంవత్సరానికి అంటే 1964-65కి గ్రామీణాభివృద్ధి, స్థానికాభివృద్ధి కార్యక్రమాలను రూపొందించ వలసిందని ప్రణాళికా సంఘం రాష్ట్రప్రభుత్వాలకు సూచించింది.

వార్షిక ప్రణాళికలను నికరపరిచేందుకు తమ ప్రతినిధులు ఢిల్లీకివచ్చినప్పుడు వారితో ఒకప్రత్యేక పరిశీలక బృందం గ్రామీణాభివృద్ధి కార్యక్రమ వివరాలను చర్చిస్తుందని కూడా రాష్ట్రాలకు తెలియచేయడమయింది.

ప్రీఅగ్రికల్చర్ కోర్సు

హైదరాబాదు, అక్టోబరు 18

ప్రీ అగ్రికల్చర్ కోర్సులో కొన్ని సీట్లు ఖాళీగా వున్నాయనీ, 1963 అక్టోబరు 24వ తేదీన అభ్యర్థుల ప్రతిభ ప్రాతిపదికపై ఈస్థానాలను భర్తీచేయ

ఆజాద్ కాశ్మీర్‌లో ఆకలి చావులు

శ్రీనగర్, అక్టో 18

పాకిస్తాన్ అక్రమిత కాశ్మీర్ భూభాగంలోని జాకర్దుతహాల్‌లో చాలా మంది ఆహారలేక చనిపోయారట. ఈతహసిల్‌కు ఆహారధాన్యాల ఆజాద్ కాశ్మీర్ ప్రభుత్వం సరఫరా చేయలేదని తెలుస్తున్నది. అసలుకుపూర్తి ఆజాద్ కాశ్మీర్ ప్రాంతంలోనే క్షామపరిస్థితులు ఏర్పడినవి. జీవితావసర వస్తువులు దొరకడంలేదు.

కలకత్తాలో బియ్యం సరఫరా పరిస్థితి

సంతృప్తికరమని పి.సి. సేన్ వివరణ

కలకత్తా, అక్టో 18

కలకత్తా మరియు పరిసర ప్రాంతాలలో బియ్యం సరఫరా పరిస్థితి సాధారణముగా ఉన్నదని కలకత్తా పరగణా 24 పరగణాజిల్లాలలో ఎట్టి అవాంఛనీయ సంఘటనలు జరుగలేదని బియ్యం మణుగురు. 85కు అమ్మబడుతున్నాయని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి శ్రీ పి.సి. సేన్ తెలిపారు.

డేనియల్ వాల్కాట్‌పై చర్య

న్యూఢిల్లీ, అక్టో 18

భారతదేశం నుండి తనస్వంత విమానంలో పారిపోయిన అమెరికన్ జాతీయుడు డేనియల్ వాల్కాట్ అంతర్జాతీయ విమానయాన నిబంధనలఉల్లంఘించాడని ఆతనిపై చర్య తీసుకొనవలసినదిగా భారత ప్రభుత్వం యునైటెడ్ స్టేట్సు ప్రభుత్వాన్ని కోరింది.

గోపాలన్‌పై క్రమశిక్షణ చర్య

న్యూఢిల్లీ, అక్టోబరు 18

భారత కమ్యూనిస్టుపార్టీ జాతీయ మండలి ఎ. కె. గోపాలన్‌పై క్రమశిక్షణచర్య తీసుకోవాలన్న తీర్మానాన్ని నేడు చర్చించినది అయితే దీనిపై లేఖగాని నిర్ణయం తీసుకోబడదు. ఈ తీర్మానం గోపాలన్ను పార్టీ కేంద్ర కార్యవర్గం నుండి ఆరు నెలలపాటు బహిష్కరించాలని ఈతని చర్యను బహిరంగంగా నిరసించాలని కోరుతున్నది. గోపాలన్ లోకసభలో కమ్యూనిస్టు గ్రూపు నాయకుడు. ఈతను పార్టీ ఆదేశాన్ని తిరస్కరించి కలకత్తాలో జరిగిన పెకింగ్ అనుకూల కమ్యూనిస్టుల ర్యాలీలో ప్రసంగించారు.

'దురాక్రమణ ప్రతిఘటనకై దేశ ప్రజలకు' ఉద్బోధ

గేయ నాటిక విభాగం

నాటకోత్సవాలు నవంబర్ 18 నుండి ప్రారంభం

న్యూఢిల్లీ, అక్టోబరు 18

కేంద్ర సమాచార రేడియో మంత్రిత్వశాఖ తాలూకు గేయనాటిక విభాగం ఆధ్వర్యంక్రింద అష్టమ వేసవి నాటకోత్సవాలు ఈ సంవత్సరం ఏప్రిల్ - మే కు బదులు నవంబరు 18వ తేదీనుంచీ మూడు వారాల పాటు జరుగుతాయి లోగడవలెగాక యీ సంవత్సరం నాటకాలు దురాక్రమణ ప్రతిఘటనకు సంబంధించిన ఇతివృత్తాలోగడవలె తక్కువే వుంటుంది! కాని నాటకాల ప్రదర్శనం సాయంత్రము 6-30 గంటలకు ప్రారంభ మౌతుంది.

గేయనాటక విభాగం పంచవర్ష ప్రణాళికా ప్రచారం కొనసాగించడానికి 1954 నుంచీ యీ నాటక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఇప్పుడు దేశములోని అత్యవసర పరిస్థితి కారణముగా అందుకనుగుణమయిన ఇతివృత్తాలతో కూడిన నాటకాలు ప్రదర్శిస్తారు. ఆ నాటకాలు వినోదంతో పాటు, ప్రస్తుత పరిస్థితి ప్రాముఖ్యాన్ని కూడ వివరిస్తాయి.

వీనులవిందొనర్చే ఆకాశవాణి సంగీత సమ్మేళనం

నవంబరు 2న ప్రారంభం

న్యూఢిల్లీ, అక్టో 18

ఆకాశవాణి దశమ సంగీత సమ్మేళనం నవంబరు 2వ తేదీన ప్రారంభమవుతుంది. ఇటువంటి సంగీత సమ్మేళనాలను ఆకాశవాణి ఎలేటా ఏర్పాటు చేస్తోంది.

గతసంవత్సరాలలోవలెనే ఈయేడు కూడా యీ సంగీతోత్సవం ఉత్తరాదిన, దక్షిణాదిన ఒకేసారి జరుగుతుంది. ఉత్తరాది కచేరీలలో ఢిల్లీలో ఏడు, బొంబాయి, కలకత్తాలలో తలారెండు కచేరీలు ఏర్పాటవుతాయి. శ్రీమతి ఎం. ఎస్. సుబ్బులక్ష్మి బిస్మిల్లాఖాన్, ఓంకారనాథ్ ఠాకూర్ అలీఅక్బర్ ఖాన్ ప్రభృత సుప్రసిద్ధ సంగీతవిద్వాంసులుఢిల్లీలో ఈ కచేరీలు చేస్తారు బొంబాయిలో బడే గులామాలీఖాన్ కచేరీ వుంటుంది.

ఉత్తరాదిలోవలెనే దక్షిణాదినకూడ కర్నాటక సంగీత. హిందూస్థానీసంగీత కచేరీలు మద్రాసు, బెంగుళూరు, తిరువీరపల్లి, హైదరాబాదు, విజయవాడ, తిరువనంతపురములలో జరుగుతాయి. మద్రాసులో ఎనిమిది కచేరీలూ, బెంగుళూరు, తిరువీరపల్లి, హైదరాబాదులలో మూడేసి కచేరీలూ, విజయవాడలో రెండు కచేరీలూ, తిరువనంతపురంలో ఒక కచేరీ ఏర్పాటు చేస్తున్నారు. మద్రాసు, బెంగుళూరులలో ఒక్కొక్క హిందూస్థానీ సంగీత కచేరీ జరుగుతుంది. ద్వారం వెంకటస్వామి నాయుడు, సెమ్మంగుడి శ్రీనివాసఅయ్యర్, బాలమురళీకృష్ణ కుమారి వసంత, శ్రీమతి పట్టమ్మాళ్ ప్రభృత సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు యీ కచేరీలు చేస్తారు. దక్షిణాది శ్రోతలకు వీరినిపరిచయం చేయవలసిన అవసరంలేదు.

వీరేగాక, యింకా అనేకమంది విఖ్యాత గాయక, గాయనీమణులూ, వాద్య సంగీత నిష్ణాతులూ యీ సంగీతోత్సవానికి జిలుగువెలుగులు కూరుస్తారు.

నిముటివలెనే, యీయేడు గూడా లలిత సంగీతకచేరీలకు శాస్త్రీయ సంగీతకచేరీలతో సమమైన స్థానం ఇస్తున్నారు. మహేంద్రకపూర్, ముఖేష్, ముజాద్దీద్ నియాజీ, సుమన్‌కళ్యాణ్‌పూర్, సురేంద్రకార్. సంధ్యాముఖర్జీ ప్రభృత గాయక, గాయనీమణులు ఉత్తరాది శ్రోతలకూ, కళింగరావు, టి. ఆర్. మహాలింగం, గోకులపాలం, లీల, కోమల, బాలసరస్వతి మొదలైన గాయక గాయనీమణులు దక్షిణాది శ్రోతలకూ లలితసంగీతసుధలనందిస్తారు

కాశ్మీరు ప్రకృతి రామణీయకతకు తన్మయుడై, భూలోకస్వర్గం ఏదైనా వుంటే అది యిదే అని పాడిన పాడుషా వర్ణించాడట. అట్టి కాశ్మీరు సంగీత సంప్రదాయబద్ధమైన "సూఫియానాకలు" అనే కార్యక్రమాన్ని ఈయేటి సంగీత సమ్మేళనోత్సవములో జేర్చడంతో యీ ఉత్సవాలుఒక విశిష్టతను సంతరించుకున్నాయి.

సమాజ వికాస కార్యక్రమ నిర్వహణ

ఉత్తమ గ్రామ సేవకులకూ, గ్రామ సేవికలకూ బహుమతి ప్రదానం

న్యూఢిల్లీ, అక్టో 18

ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిజిల్లాలోఉన్న చాకియాబ్లాకులోపనిచేస్తున్న శ్రీముఖ్యామ్‌సింగ్‌ను ఉత్తమ గ్రామసేవక్ గానూ, మహారాష్ట్రలో థండారా జిల్లాలో పావ్‌నీ బ్లాకులో పనిచేస్తున్న శ్రీమతి శకుంతలాబాయి రౌత్‌ను ఉత్తమ గ్రామసేవికగానూ జాతీయ పోటీలో నిర్ణయించారు.

జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతిని మైసూరు రాష్ట్రంలో బళ్ళారి జిల్లాలో కుడ్లిగి బ్లాకులో గ్రామసేవక్‌గా పనిచేస్తున్న శ్రీ మహమ్మదు హనీఫ్‌కూ, మైసూరు రాష్ట్రములో కూర్గు జిల్లాలో మెర్కారా బ్లాకులో గ్రామసేవికగా పనిచేస్తున్న శ్రీమతి ఎమ్. ఆర్. నీలావతికి యిచ్చారు.

సమాజాభివృద్ధి కార్యక్రమాన్ని అమలు జరపటంలో ఉత్తమగ్రామంగా రాజస్థాన్‌లో కోటా జిల్లాలో బరాన్ బ్లాకులో ఫతేపూర్ నూనిర్ణయించారు. కేంద్రపాలిత ప్రాంతాలలో యీబహుమతి త్రిపురాలో నొవాబాదీ గ్రామానికి దక్కింది.

కేంద్ర సహకార శాఖ ఉపమంత్రి, శ్రీఎస్.డి మిశ్రా బహుమతి విజేతలకు బహుమతులు పంచిపెడుతూ, సమాజ వికాస కార్యక్రమాన్ని అమలు జరపటంలో గ్రామసేవకులూ, గ్రామసేవికలూ బాధ్యత వహించి పనిచేయాలని ఉద్బోధించారు.

'భారత దేశంలో దీపాలు'

ఫిల్ము శాఖ డాక్యుమెంటరీ వర్ణచిత్రం

బొంబాయి, అక్టో 18

భారతదేశంలో కీ.పూ. 3000 సంవత్సరాల నుంచీ వాడకంలోఉన్న రకరకాల దీపాలను గురించి వివరిస్తూ రేడియో సమాచార మంత్రిత్వ శాఖకు చెందిన ఫిల్ము శాఖ తీసిన డాక్యుమెంటరీ వర్ణచిత్రం నేడు దేశవ్యాప్తంగా విడ దలఐంది-

యునైటెడ్ నేషన్ కార్యకలాపాలపై డాక్యుమెంటరీ చిత్రం

యునైటెడ్ నేషన్స్ నిర్వహించే వివిధ కార్యకలాపాలనూ, ఈ సంస్థ ప్రణాళిక లక్ష్యాలనూ వివరిస్తూఫిల్ము శాఖ తీసిన "ప్రణాళిక" అనే మరో డాక్యుమెంటరీ చిత్రం కూడా ఈ నెల 18వ తేదీన విడుదల కానున్నది.

భారతీయ వార్తా చిత్రం

ఈనెల 18వ తేదీన దేశవ్యాప్తంగా విడుదల కానున్న భారతీయ వార్తా చిత్రంలో భారత రాష్ట్రపతి డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్ బొంబాయిలో రెండు రోజులపాటు జరిపిన పర్యటన, కొన్ని రాష్ట్రాలలో క్రొత్త మంత్రుల ప్రమాణ స్వీకారంతాలూకుదృశ్యాలు చూడవచ్చును.

కొత్తరకం టెలివిజన్ కెమేరా

లండన్, అక్టో 18

వెలుతురు సరిగ్గా లేకపోయినప్పటికీ మంచి బొమ్మను ముద్రించే కొత్త రకం టెలివిజన్ కెమేరాను బ్రిటన్‌లో ఒక సంస్థ తయారు చేసినది. మామూలుగా అయితే వెలుతురును పరిశీలించి కెమేరాను చేత్తో సర్దుబాటు చేసుకొనవలసి ఉంటుంది. ఈ కెమేరాలోని బొత్తామునువత్తితే వెలుతురు-ఫొటో పడడానికి సరిపోయేటంత సర్దుబాటు అవుతుంది. పనిపూర్తి అయినతరువాత బొత్తామును ఆఫ్ చెయ్యాలి.

విసి 10, విఎసి 1-11 విమానాలకు ఈ కెమేరా బాగా ఉపయోగపడుతుంది. ఉక్కు పరిశ్రమకు కూడా బాగా ఉపయోగపడుతుంది.

విజయవాడలో నైతిక పునరుద్ధరణ బృందం

విజయవాడ, అక్టో 18

భారతయాత్రలో దేశంలోని వివిధ ప్రధాన నగరాలను సందర్శిస్తున్న ఎం. ఆర్. పి. నైతిక పునరుద్ధరణ సంఘము (మోరల్ రీఆర్మమెంటు) బృందం సన్మానార్థం నిన్న యిక్కడ జరిగిన బహిరంగసభలో జాతీయ శీలంలో విప్లవాత్మకమైన చైతన్యాన్ని సాధించాల్సిన ఆవశ్యకతను పలువురు పేర్కొన్నారు.

ఈ నైతిక పునరుద్ధరణ బృందము వారు అక్టోబరు 2 న కన్యాకుమారి నుండి ఈ భారతయాత్ర ప్రారంభించారు. వీరు కేరళ, మద్రాసు, మైసూరు రాష్ట్రాల్లో పర్యటించిన అనంతరం నిన్న విజయవాడ చేరారు. విజయవాడ నుండి బైలుదేరి నేడు ఈ బృందము హైదరాబాదు వెళ్ళింది.

మహాత్మాగాంధీ మనుమడు శ్రీ రాజమోహనగాంధీ ఈ బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. ఆయన అనారోగ్యంవల్ల మద్రాసులోనే ఆగిపోయినందున ఈ బృందానికి శ్రీ వి. సి. విశ్వనాథన్ నాయకత్వం వహించారు.

హైదరాబాదుకు శ్రీ గాంధీ మద్రాసు నుండి నేరుగా చేరారు.

నేపాల్‌కు రెండు ఋణాలు

వాషింగ్టన్, అక్టో 18

యు. ఎస్. అంతర్జాతీయ అభివృద్ధి ఏజెన్సీ ఒకొక్కటి రు.50 లక్షల చొప్పున చేసే రెండు ఋణాలను నేపాల్‌లో ప్రయివేటు పరిశ్రమలకై ఇస్తున్నది.

ఈ ఋణాలు నేపాల్ పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్‌కు ఇవ్వబడుతున్నాయి. ఈ ఋణాల క్రింద యునైటెడ్ స్టేట్సు భారతదేశాల నుండి యంత్ర సామగ్రిని దిగుమతి చేసుకొనవచ్చు నిపుణుల సేవల సంపాదింపుకోవచ్చు.

రాయల్ ఎయిర్ ఫోర్సు ఆఫీసర్ల రాక

కలకత్తా, అక్టో 18

వచ్చేనెలలో జరిగే సమష్టి వైమానిక విన్యాసాలలో పాల్గొనే నిమిత్తం కలకత్తాకు సమీపంలోగల ఇండియన్ ఎయిర్ ఫోర్సు స్టేషనుకు 50 మంది రాయల్ ఎయిర్ ఫోర్సు ఆఫీసర్లు బ్రిటానియా ఎయిరు క్రాఫ్టు విమానంలో వచ్చారు. బ్రిటన్ నుండి మొత్తం 250 మంది వైమానిక సిబ్బంది ఈ విన్యాసాలలో పాల్గొనేందుకు వస్తున్నారు.

30 వ వారం!
రీగల్ - ఖైరతాబాద్, హైదరాబాద్.
ప్రతిరోజు 2-00, 6-00, 9-45
లలితా శివజ్యోతి ఫిల్మ్స్ వారి:
లవకుశ
30వవారం: రాజరాజేశ్వరి-వరంగల్
3వ వారం: నాగేశ్వర్-కొత్తగూడెం
2వ వారం: భారత్-కరీంనగర్
మరియు శ్రీకృష్ణ - సూర్యపేట
—చక్రమీయా విడుదల.

వేటి రాత్రి
ఫిలిమ్ యుగ్స్:
ఆస్కా - పంచి

రాజేంద్రకుమార్, వైజయంతిమాల, సుందర్, నజీర్ హుసేన్.
దర్శకత్వం: మోహన్‌కుమార్
సంగీతం: శంకర్ జైకిషన్
మనోహర్
సికింద్రాబాద్
ఆటలు: 3-30, 6-30, 9-30

విశ్వావసు నామ సం॥ కార్తిక శు॥ దిగు రా 10-55 స్వాతి ఉ 10-15 సా వ 4-33 మొ: 6-21 వరకు శాలివాహన శకము: 27-7-1885) 19-10-1963 శని వారము

"మానుషము దుర్లభము సోపానంబగునదివిముక్తి పదము గనుటకున్ దానిఁగని తొంటి చందము రానీక సముద్యమము నఁ బ్రాఁకఁగ వలదే."

—భారతము (శాంతి)

గోలకొండపత్రిక
ఫోన్ నెం. 35280
19 అక్టోబరు 1963
శని వారము

హిందీ వ్యతిరేక ఆందోళన

—(o)—

మద్రాసురాష్ట్రములో ద్రవిడ మున్నేత్ర కజగం హిందీకి వ్యతిరేకముగా ఒక తీవ్ర ఆందోళనోద్యమమును నిర్వహించుటకు నిశ్చయించినది. ప్రభుత్వ కార్యాలయాల ముందు పికెటింగు చేయుట, భారతరాజ్యాంగములోని హిందీకి సంబంధించిన సూత్రాలు ముద్రితమైన కాగితాలను దగ్ధము చేయుట మొదలయిన పనులు యీ ఆందోళనోద్యమములో ముఖ్యమైనవి. భారత రాజ్యాంగము దేశీయులకు పవిత్రమయిన గ్రంథము. ఈ గ్రంథములోని భాగాలను దగ్ధముచేయుట యనగా భారత రాజ్యాంగమును అవమానించుట; అగౌరవించుట. ఈ పని దేశద్రోహకరమైనది; రాజద్రోహకరమైనది. ఈవిధముగా ద్రవిడ మున్నేత్ర కజగం ప్రారంభించుటకు నిశ్చయించిన ఉద్యమము దేశానికి అరిష్టదాయకమైనది; విచ్ఛిన్నకరమైనది. అందుచేత యీ ఉద్యమమును అణచివేయక తప్పదు.

కొన్ని నెలల క్రింద ద్రవిడ మున్నేత్ర కజగం నాయకుడు రాజ్యసభలో ప్రసంగించుచు ప్రస్తుత పరిస్థితులలో విచ్ఛిన్నకరమైన ఉద్యమాలను వేనినికజగం నిర్వహించదని ఉద్ఘాటించియున్నారు. కానియింతలోనే యీ ఉద్ఘాటనలో యెందుకు మార్పు వచ్చినదో తెలియదు. బహుశా యీ మార్పుకు కారణము యేవో స్థానిక రాజకీయాలు కావచ్చును. ఏమైనప్పటికిని ద్రవిడ మున్నేత్ర కజగం ఆశయాలు దేశ సమైక్యతను విచ్ఛిన్నము చేయునట్టివి. తమిళులు ప్రత్యేక జాతీయని తమిళనాడు భారతదేశమునుండి విడిపోవలెనని ఉద్ఘాటించుచు, ప్రజలలో ద్వేషమును వ్యాపింపజేయుటకు ద్రవిడ మున్నేత్ర కజగం ప్రయత్నించుచున్నది. ఏ రాష్ట్రమైనను భారత దేశమునుండి విడిపోవలెనని యే రాజకీయ సంస్థ యైనను ఆందోళన ప్రారంభించరాదనియు, యీ ఆందోళన దేశద్రోహకరము, రాజద్రోహకరము అని యు శాసించుచట్టమును పార్లమెంటు యీ మధ్య ఆమోదించినది. అందుచేత ద్రవిడ మున్నేత్ర కజగం ప్రారంభించనున్న యీ విచ్ఛిన్నకరఉద్యమమును సకాలములో అరికట్ట వలసిన బాధ్యత మద్రాసు ప్రభుత్వము మీద నున్నది. ఆబాధ్యతను మద్రాసు ప్రభుత్వము నిర్వహించగలదని విశ్వసించవచ్చును.

హిందీ భారత దేశానికి అధికార భాషగా నిర్ణయమైనది. రాజ్యాంగ పరిషత్తు గావించిన యీ నిర్ణయమును ఆమోదించవలసిన బాధ్యత అందరి మీద కలదు. అయితే హిందీ మాతృభాషగాని ప్రజల సౌకర్యమును దృష్టిలో ఉంచుకొని, హిందీ అధికారభాషగా అమలు జేయవలసిన గడువును మరికొంత పొడిగించవలసి యుండును; ఆంగ్ల భాషను మరికొన్ని సంవత్సరాల కొరకు ప్రభుత్వ వ్యవహారాలలో నిలిపి యుంచుకొనవలసి యుండును. ఈవిషయమై ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ పార్లమెంటులో హామీలను యిచ్చియున్నారు. ఈహామీలకు అనుగుణమయిన నిర్ణయాలు ప్రభుత్వ స్థాయిలో జరిగినవి. అధికార భాషకు సంబంధించిన సదుపాయాలు మరేమైన కావలసి యున్నచో ఆవిషయమై ప్రభుత్వమును కోరవచ్చును. ప్రభుత్వము ప్రజల కోరికలను సానుభూతితో పరిశీలించగలదు. చట్టబద్ధమైన విధానాల ద్వారా సమస్యలు పరిష్కారము కాగలవు. విచ్ఛిన్నకర ఉద్యమాల వలన సాధించదగినదేమియును లేదు. ఈ ఉద్యమాలను కఠినముగా అణచివేయవలసి యుండును.

అదోనీలో ఐ. ఎన్. టి. యు. సి. కార్యకర్తల నిరాహార సమ్మె

హైదరాబాద్, అక్టోబరు 18

ఐ ఎన్. టి. యు. సి. కార్యకర్తలు ఇద్దరు శ్రీయుతులు కుబ్బాజీ, దర్గప్ప అక్టోబరు 13నుండి అదోనీలో నిరాహార సమ్మె కొనసాగిస్తున్నారని ఐ.ఎన్.టి.యు.సి. ప్రధానకార్యదర్శి శ్రీ వేదుల జగన్నాథరావు నిన్న ఇక్కడ ప్రకటించారు.

అదోనీ స్పిన్నింగ్ మిల్లులని ర్వాహక వర్గానికీ, ప్రభుత్వానికీ ఒక నెల రోజులకు పూర్వమే నోటీసు ఇచ్చిన పర్యంతము ఈ నిరాహార దీక్షను చేపట్టినట్లు ఆయన తెలిపారు.

1962 బోనస్‌కుగానూ 5 నెలల జీతానికు వేతనము, లోగడ మేనేజిమెంట్ అంగీకరించినట్టుగా అదోనీలోని ఇతర పెక్సుటైల్ మిల్లులతో సమానముగా కరువుభత్యము సవరించాలని పనివారు కోరుతున్నారు.

అదోనీ స్పిన్నింగ్ మిల్లులలోని పనివారల పోరాటాన్ని బలపర్చవలసిందిగా రాష్ట్రములోని ఐ.ఎన్.టి.యు.సి. సంఘాలన్నింటికీ విజ్ఞప్తి చేస్తూ ప్రభుత్వముజోక్యము కలిగించుకొని నిరాహార సమ్మెచేస్తున్న నాయకుల జీవితాల్ని కాపాడవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

జూనియర్ కబడ్డీ ఛాంపియన్ షిప్

హైదరాబాదు, అక్టో 18

హెల్తులీగు గ్రౌండ్సు సుల్తాన్ బజారులో నిన్న జరిగిన పై ఛాంపియన్ షిప్ పోటీలలో నవయువక సంఘం కాచిగూడా రెండు పాయింట్లతో ఆర్. టి. ఆర్. సి. పైగెలిచింది. రెండవ మ్యాచి శాంతిక్లబ్ 19 పాయింట్లతో హెల్తు లీగుపై గెలిచింది. రేపు సాయంత్రం 5-45కు మొదటి ఆట ఆర్యన్ విశాల నగరు మరియు హెల్తు లీగుతో జరుగుతుంది. రెండవ ఆట స్టార్ క్లబ్ మరియు ఆర్. టి. ఆర్. సి మధ్య 6-30 గంటలకు జరుగుతుంది.

ఏటా నేపాల్‌నుండి కలప సప్లయి

భారత రైల్వేల అవసరాలకై ఒప్పందం

భాట్మండు, అక్టో 18

ప్రభుత్వంనుండి ప్రభుత్వానికి సరఫరా చేసే ప్రాతిపదిక పై భారత రైల్వేలకు ఏటా 50 వేల ఘనపుటడుగుల కలపను సప్లయి చేయడానికి నేపాల్ ప్రభుత్వం అంగీకరించింది.

ఈ ఒప్పందానికి ముందు నేపాల్ అధికారుల బృందంతో భారత బృందం మూడుదినాలు చర్చలు జరిపింది.

మాధ్యమిక విద్యా విధానం మార్పు చెందాలి

కేంద్ర విద్యామంత్రి ప్రొ॥ హుమాయూన్ కబీర్ వెల్లడి

మద్రాసు, అక్టో 18

దేశంలో మాధ్యమిక విద్యా విధానం మార్పు చెందాలని కేంద్ర విద్యామంత్రి ప్రొ॥ హుమాయూన్ కబీరు నిన్న ఇక్కడ విలేఖరుల గోష్ఠిలో తెలియజేశారు.

పాశ్చాత్య దేశాలతో పోల్చిచూస్తే భారతదేశంలో మెట్రిక్యులేషన్ స్థాయిని ప్రాథమిక విద్యగానే పరిగణించాల్సివస్తున్నదని కూడా ప్రొ॥ కబీర్ అభిప్రాయం వెల్లడించారు.

18 సంవత్సరాల వయస్సు లేనిదే కళాశాల విద్యకు అర్హత ఉండరాదని తాను సలహా ఇవ్వడానికి కూడా ఉద్దేశిస్తున్నానని ప్రొ॥ కబీరు అన్నారు. విద్యాసంస్థల్లో నైతిక పాఠ్య ప్రణాళికను ప్రవేశపెట్టాలన్న శ్రీ ప్రకాశా కమిటీ సిఫారసుల విషయము కూడా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

పాఠశాలలు, కళాశాలలలో బోధనా భాష విషయము పేర్కొని ఆయన మాతృభాషకు ప్రాధాన్యము లేకుండా చేసేట్లు జరిగే ఏ చర్యనూ గైకొనేందుకు పూనుకోరాదని ప్రస్తావించారు.

అఖిలభారతపరీక్షలకు ఆంగ్లములో పరీక్షాపత్రాలకు జవాబులు వ్రాయవలసి వస్తుంటే ఎస్. ఎస్. ఎల్. సి. వరకూ మాతృభాషలో విద్యనార్జించిన వారు ఇబ్బంది పడుతున్నారన. విషయం ఆయన దృష్టికి తేగా దేశమంతటా విద్యార్థుల పద్ధతి ఇలాగే ఉందనీ కాన్వెంటులో ఉన్న విద్యార్థులు ఈ పరీక్షలలో ఎక్కువ సులభముగా పాల్గొగలుగుతున్నారనటము సరికాదనీ తెలిపారు.

అంధ భిక్షువు నిరాహార దీక్ష

మున్సిపల్ కార్పొరేషన్ ముందు కొనసాగింపు

హైదరాబాదు, అక్టో 18

జంటనగరాల్లోనూ భిక్షుక నిర్మూలన చట్టము అమలును వ్యతిరేకిస్తూ అక్టోబరు 6 నుండి మున్సిపల్ కార్పొరేషను కార్యాలయంవద్ద నిరశనవ్రతం ప్రారంభించిన శ్రీ అంతయ్య అను అంధ భిక్షువు ఇంకా నిరాహార దీక్ష సాగిస్తున్నారు

ఈ అంధ భిక్షువు నిరాహార దీక్ష పూనిఉన్న చోటికి రోజూ వందలాది భిక్షువులువచ్చి ఆతనిని పరామర్శించి పోతున్నారు.

ఇంతవరకూ కార్పొరేషన్ అధికారులు భిక్షువుల డిమాండ్ల విషయమై ఏమీ చర్యలు తీసుకోలేదు.

అహ్మద్ బెన్ బెల్లా న్యూయార్క్ ప్రయాణం వాయిదా

అల్జీర్స్, అక్టో 18

అల్జీరియా-మొరాకో సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం ఏమీ సడలనందున ఐక్యరాజ్య సమితి సమావేశాలకు హాజరు కావాలని ప్రయత్నించిన అల్జీరియా అధ్యక్షుడు అహ్మద్ బెన్ బెల్లా తన ప్రయాణాన్ని రెండో సారి వాయిదా వేసుకున్నాడు.

ఈ వాయిదా వేసుకోడం సంభవించకుంటే నేడే బెన్ బెల్లా విదేశాంగ మంత్రి అదిల్ అజీజ్ బౌటిఫ్లిక్‌తో కలిసి న్యూయార్క్‌కు ప్రయాణంకావల్సిఉంది.

కాబెలీ పర్వతాల ప్రాంతములో విప్లవం చెలరేగిన పరిస్థితుల్లో ఒకసారి మునుపు ఈ ప్రయాణము వాయిదా పడింది.

ఎనుకూరు హత్య దర్యాప్తు

ఆ గ్రామస్తుడే జరిపినట్లు అనుమానం

హైదరాబాదు, అక్టో 18

ఎనుకూరు పంచాయతీ అధ్యక్షుడు శ్రీ కె. సుబ్బారావు హత్యకు సంబంధించిన ఒక వ్యక్తిని అరెస్టు చేయడానికి ఖమ్మం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం రాత్రి ఆయనను ఎవరో ఇంటివద్దనే కాల్చి చంపారు.

ఒక నెలరోజుల క్రితం ఒక భూమి తగాదా విషయంలో శ్రీ సుబ్బయ్య ఒక తీర్పు ఇచ్చి ఉన్నారనీ ఈ తీర్పు ఈ హత్యకు దారితీసిందనీ భావించబడుతున్నది.

కాశ్మీర్‌లో అవినీతి నిర్మూలన

ప్రభుత్వం చర్యలు గైకొనున్నట్లు ముఖ్యమంత్రి షంసుద్దీన్ వెల్లడి

శ్రీనగరు, అక్టోబరు 18

కాశ్మీరులో అవినీతిని రూపుమాపేందుకు కొన్ని పరిపాదనల్ని తన ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు కాశ్మీరు ముఖ్యమంత్రి షంసుద్దీన్ నిన్న ఒక ప్రకటనలో అన్నాడు.

కాశ్మీరు ముఖ్యమంత్రి పదవిని స్వీకరించిన తర్వాత షంసుద్దీన్ నిలేఖరుల గోష్ఠిని జరుపడం ఇదే తొలిసారి.

ఈ అవినీతి నిర్మూలన ప్రతిపాదనలు ఏ స్వరూపంలో ఉంటాయో తాను ఇప్పుడే చెప్పజాలననీ అయినా ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతి పరులను తొలగించేందుకు చర్యలు గైకొనబడుతాయని షంసుద్దీన్ అన్నారు.

ప్రభుత్వ వ్యవస్థల్లోను, ఉద్యోగాల్లోను వెనుకబడిన తరగతుల వారికి ప్రాధాన్యం ఇవ్వడం కొనసాగుతుందని కూడా షంసుద్దీన్ అన్నారు,

భారతీయ బాలల కార్నివాల్

ఈనెల 28 న ఢిల్లీలో ప్రారంభోత్సవం

న్యూయార్కు, అక్టో 18

ఢిల్లీలోని జాతీయ బాలల మ్యూజియానికి అమెరికన్ మ్యూజియముల అంతర్జాతీయ మండలివారు బహూకరించిన బాలల క్రీడా వస్తువుల, కళాభ్యసన పరికరాల కార్నివాల్‌కి అక్టోబరు 26న ప్రారంభోత్సవం చేయటానికి న్యూయార్కులోని మోడరన్ ఆర్టు థియేటర్ విద్యా విభాగం డైరెక్టరు విక్టర్ డెమికో వస్తున్నారు. బాలలకు కళలు నేర్పటంలో ఉపాధ్యాయులు అనుసరించే పద్ధతులను గురించి ఈయన భారతీయ ఉపాధ్యాయులకు నేర్పుతారు.

శ్రీమతి జాన్ ఎఫ్. కెనెడి 1962 లో ఇండియా వచ్చినప్పుడు ఈ కార్నివాల్‌ను బహూకరిస్తున్నట్టు వెల్లడించారు. దీనిని ఇండియాలోనూ, అమెరికాలోనూ నిర్మించారు. మోడరన్ ఆర్టుమ్యూజియం 20 సంవత్సరాలుగా ఏటా ఈ కార్నివాల్ జరుపుతున్నది.

ఇది బాలలకు వినోదం చేకూర్చటానికి, కళలు నేర్పటానికి మాత్రమే కాక భారతీయ ఉపాధ్యాయులకు పరిశీలన, శిక్షణ పథకంగా కూడా పనికి వస్తుంది. ఢిల్లీబాలల జాతీయ మ్యూజియం డైరెక్టరు ప్రభాసహస్ర బుద్ధే నాయకత్వాన ఇందుకొక కార్యక్రమం కూడా ఏర్పాటు చేస్తున్నారు.

భారతీయ ఉపాధ్యాయులకు ఈ విషయంలో శ్రీ రెమికో మరి నల్గురు అమెరికన్‌లు తోడ్పడతారు. ఈయన ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో కార్యాలయం యేర్పాటు చేసుకొని పనిచేస్తారు.

ఢిల్లీబాలల జాతీయ మ్యూజియం శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వాన కొంతకాలం క్రితం ఏర్పాటయింది. ఈ ప్రారంభోత్సవములో అమెరికా పాల్గొంటున్నారు.

దీనికి ఢిల్లీలో ప్రారంభోత్సవం జరిగిన తరువాత ఇండియాలోని అయిదు ప్రధాన నగరాలకు తీసుకవెళ్ళి ప్రదర్శించి తిరిగి తీసుక వచ్చి ఢిల్లీ బాలల మ్యూజియంలో శాశ్వతంగా ఉంచుతారు.

తడవకు 40 మంది బాలబాలికలకు ఈ కార్నివాల్‌లో జాగా ఉంటుంది. బాలలలో కళాభిరుచి పుట్టి పెరగటానికి తోడ్పడే విధంగా ఈ క్రీడా వస్తువుల మండపం ఏర్పాటు చేయబడింది.

వెన్నుమీద చేయివేస్తే అర్థ చక్రాకారంలో నిలుచునే ఫరీ పిల్లి. తేలికగా ఉండే ఫౌంటెన్, బాలల అభ్యాసానికి ఉపయోగించే మేగ్నటికు బల్ల ఒకటి ఉన్నవి.

స్టుడియో బోధన శాలలో రంగులు కుంచెలు, బొమ్మలు గీచే కాగితం, బాలలకు శాభిరుచి పెరగటానికి తోడ్పడే ఇంకా ఇతర వస్తువులు ఉంటవి.

సిరియాలో 13 గురికి ఉరి శిక్ష

డెమాస్కస్, అక్టో 18

సిరియాలో ప్రస్తుతం అధికారంలో ఉన్న బాతిస్టు పార్టీ ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి జులై 18న విప్లవము జరిగిన సందర్భంగా 13 గురికి ఉరి శిక్ష విధించబడింది.

ప్లాస్టిక్ పడవ

సోఫియా, అక్టో 18

వార్నాలో గియోర్గీ డిమిట్రావ్ నౌకా నిర్మాణకేంద్రం మొట్టమొదటి బ్లేరియన్ ప్లాస్టిక్ పడవను తయారుచేసింది. దాని నిర్మాణంలో కర్రగాని, లోహముగాని, అతుకులు (రివిట్లు)గాని లేవు. ఈ పడవ బరువు 150 కిలోగ్రాములుంది; అందులో నలుగురు కూర్చొవచ్చును. అది గంటకు 50 కిలోమీటర్ల వేగాన వెళ్ళుతుంది. ఇది మునిగిపోవడంగాని, నీటికి కొరుకుడుపడడంగాని వుండదు. ఇది ఉక్కుతోచేసిన యిదే సైజు పడవకంటే 4.5 రెట్లు తేలిక. దీనిని నడపటం చాలా సులభం.

వచ్చే ఏడాది యీ విధమైన పడవలు 800 నిర్మించబడతాయి.

శ్రీయద్దనపూడి గోపాలకృష్ణయ్య అస్తమయం

కోడూరు, అక్టో 18

ప్రముఖదివిసీమ కాంగ్రెస్ కార్యకర్త, మాజీ కోడూరు పంచాయతీ కోర్టు అధ్యక్షులు శ్రీయద్దనపూడి గోపాలకృష్ణయ్య ఈనెల 9 వ తేదీన అస్తమించారు.

వీరు 1898 వ సంవత్సరములో దివిసీమలో జన్మించారు. వీరు 1926 నుంచి ప్రముఖ గాంధేయవాదిగా, ప్రజలరాజకీయవేత్త గా శ్రీమంతరాజాయార్లగడ్డ శివరామప్రసాద్ బహద్దూర్ (ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖా మాత్యులు) చే స్థాపించబడిన ప్రజామిత్ర పార్టీలో పనిచేసి జస్టిస్ పార్టీని ఎదుర్కొన్నారు. కీర్తిశేషులు డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య, శ్రీచెరుకువాడ వెంకటనరసింహం పంతులు, స్వర్గీయ శ్రీఅయ్యదేవర కాళేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యల అనుచరుడుగా శ్రీ చల్లపల్లి రాజా కుడి భుజంగాఖ్యాతి పొందారు. వీరుజ్యోతిష వేదాంత శాస్త్రములలో అపార జ్ఞానాన్ని ఆర్జించారు. శ్రీజగద్గురు శ్రీత్రివిక్రమ రామానంద భారతి (శ్రీదేశ్వరీ పీఠాధిపతి కుర్తాళం) స్వామివారి ప్రియశిష్యులుకూడా.

కమ్యూనిస్టుపార్టీలో చైనా భక్తుల ఛాలెంజి

అధికార తీర్మానాన్ని వ్యతిరేకించగా పునః పరిశీలనకు భారతీయమండలి నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబరు 18

ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమములోను భారత కమ్యూనిస్టుపార్టీలోను చీలికలకు కారణమవుతున్న సిద్ధాంత విభేదాల్ని గురించి పార్టీ నాయకుల మధ్య పరిశీలనకు తిరిగి పూనుకోడానికి గతరాత్రి భారతకమ్యూనిస్టుపార్టీ జాతీయమండలి నిర్ణయించింది.

ఈ నిర్ణయము తీసుకొనే ముందు మూడుగంటలపాటు చర్చలు జరిగాయి. కొంతసేపు చర్చలు తీవ్ర స్థాయిలోనే సాగినట్లు తెలుస్తున్నది.

సంస్థాగత వ్యవహారాల్ని కమ్యూనిస్టుపార్టీ జాతీయ మండలి నిన్న చర్చించవలసి ఉంది గాని ఆ చర్చకు అవకాశము లభించలేదు శ్రీ ఎ. కె. గోపాలన్ తదితరులపై క్రమశిక్షణ చర్య తీసుకోడము సమంజసముకాదా అను విషయంకూడా నిన్ననే చర్చించవలసి ఉంది.

అంతకుముందు రాత్రే సోవియట్ కమ్యూనిస్టుపార్టీ వైఖరిని ఆమోదిస్తూ భారత కమ్యూనిస్టుపార్టీ జాతీయమండలి తీర్మానము ఆమోదించిన విషయం పాఠకులెరిగినదే ఈ తీర్మానానికి అనుకూలముగా 52మంది ప్రతికూలముగా 22 మంది ఓటుచేశారు. తటస్థముగా ఉన్న ముగ్గురిలో శ్రీ ఇ. ఎం. ఎస్. నంబూద్రిపాద్ ఒకరు. శ్రీ నంబూద్రిపాద్ తీర్మానానికి అనుకూలముగా 25 ఓట్లు వ్యతిరేకముగా 52 ఓట్లు రావడముతో అది వీగి పోయింది.

అధికార తీర్మానం (మొన్న ఆమోదించబడిన రష్యా కమ్యూనిస్టు పార్టీ వైఖరిని అనుసరించే తీర్మానం) ఏ విధముగా సబబు అని పార్టీలోని వామపక్షీయులు శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య, శ్రీ పి. రామమూర్తి, శ్రీ మాకినేని బసవపున్నయ్య మున్నగువారు ఛాలెంజి చేయడం వల్ల తిరిగి పరిశీలించడానికి పార్టీ జాతీయమండలి ఒప్పుకోవలసి వచ్చినట్లు తెలుస్తున్నది. ఓటింగ్ ఫలితాల్ని బట్టి అధికార తీర్మానము మొత్తం పార్టీ సభ్యులందరి అభిప్రాయమూ కాదని తెలుస్తున్నది కాబట్టి పునః పరిశీలించాలని ఈ చైనా భక్తవర్గం ఛాలెంజి చేసిందట.

అసలు జాతీయ మండలి సభ్యుల సంఖ్య 101 మంది. మొత్తం అందరూ హాజరైఉంటే శ్రీ నంబూద్రిపాద్ తీర్మానమే ఆమోదింపబడేదని కూడా ఈ వర్గం వాదించినట్లు తెలుస్తున్నది.

కేంద్ర కమ్యూనిస్టు కార్యవర్గము గత వారంలోసమావేశమై శ్రీ గోపాలన్ తదితరులపై క్రమశిక్షణ చర్యను గురించి చర్చించింది. శ్రీ గోపాలన్ సంజాయిషీ దృష్ట్యా తీర్మానరచన ఒక ఉప సంఘానికి అప్పగించబడింది. లోకసభలో కమ్యూనిస్టుపార్టీ నాయకుడుగా వ్యవహరిస్తున్న గోపాలన్‌పై చర్యతీసుకోవాలనే పార్టీ కార్యవర్గములో పలువురు భావిస్తున్నట్లు తెలుస్తున్నది.

సంస్థాగత వ్యవహారాలు చర్చించే సమయంలో ఆంధ్ర, బెంగాల్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కొన్ని పార్టీ పత్రికలపై చర్యలు తీసుకోడం గురించి, ఈసారిపార్టీ కాంగ్రెసు జరిపే తేదీని గురించి నిర్ణయాలు తీసుకోవచ్చునని తెలుస్తున్నది

శ్రీ డాంగే నాయకత్వానగల పక్షంలోగల ఉపసంఘం శ్రీ ఎ. కె. గోపాలన్‌ను ఆరుమాసాలపాటు పార్టీ నుండి నిస్సెండు చేయాలని సూచిస్తూ తీర్మానం తయారు చేసినట్లు జాతీయ వార్తల్ని బట్టి తెలుస్తున్నది. ఈరాత్రే ఈ తీర్మానం చర్చకు గైకొంటారు.

లేఖావళి

తెలుగు - కన్నడ భాషలకు ఏకలిపి

ఆర్యా!

ఆంధ్ర ప్రభుత్వము నియమించిన తెలుగు లిపి సంస్కరణ సంఘం సమర్పించిన నివేదికను ప్రజాభిప్రాయము కోసరం ఆంధ్ర గెజెట్‌లో ప్రకటింపబడింది. ఈ సంఘమువారు చేసిన సిఫార్సులలో తెలుగు - కన్నడ భాషలకు ఏకలిపిని రచించడం ఒకటి. నివేదికలో ఇలా వుంది:-

"ఈ రెండు భాషలకు ఒకటే సామాన్య లిపి ఉండడం లాభకరమే. దీని విషయమై ఉభయ ప్రభుత్వాలు కలిసి ఆలోచించవలసి ఉంటుందని ఈ లిపి సంస్కరణ సంఘమువారు అభిప్రాయపడుతున్నారు".

